

26న '20 సూత్రాల' అమలు కమిటీ చైర్మన్ రాక

పార్వతీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఈ నెల 26న '20 సూత్రాల' కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ రానున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులపై కలెక్టరేట్‌లోని జిల్లా అధికారులతో సమీక్షించనున్నారని పేర్కొన్నారు. పర్యాటక కార్యకలాపాలు, పారిశ్రా మిక పార్క్‌లు, మురికివాడల అభివృద్ధి, తాగునీరు సరఫరా తదితర అంశాలపై చర్చించనున్నారని వెల్లడించారు. సంబంధిత అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

తవ్వేస్తూ.. తరలిస్తూ..!

- ఇసుకాసురుల బరితెగింపు
- కోనేరు రామభద్రపురం సమీపాన నాగావళిలో తవ్వకాలు
- ఉదయం పోగు చేసి.. రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా



ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను కుప్పగా వేస్తున్న దృశ్యం

పార్వతీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించేది లేదని పదేపదే రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారడం లేదు. అక్ర మార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత శాఖలు మౌనం వహిస్తుండడంతో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. జిల్లాలో కొమరాడ మండలం కోనేరు రామభద్రపురం సమీపంలోని నాగావళి ప్రాంతంలో అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపి.. యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. ఈ నెల 21 నుంచి అక్రమార్కులు తమ దందా కొనసాగిస్తున్నారు. యంత్రాల సాయంతో ముందుగా ఇసుకను తవ్వి పోగు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో లారీలకు లోడ్ చేస్తున్నారు. ఆ తర్వాత ప్రణాళిక ప్రకారం ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అయినా గనుల, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనుక రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నారని సమాచారం. వారికి నెలవారీ మామూలు ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చు కున్న తర్వాతే అక్రమార్కులు ఇసుక తరలింపు ప్రక్రియ ప్రారంభించినట్టు తెలిసింది.

అప్పట్లో బహిరంగంగా... ప్రస్తుతం గుట్టుగా...

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో బహిరంగంగానే ఇసుకను అక్రమంగా తరలించేవారు. అడ్డుకున్న వారిపై తిరిగి దౌర్జన్యం చేసేవారు. అధికారులు కూడా బదిలీలకు గురికావాల్సి వచ్చేది. కోనేరు రామభద్రపురం సమీపంలోని నాగావళి ప్రాంతంలో అనుమతులకు మించి తవ్వకాలు జరిపారు. గడువు ముగిసినా కొందరు వైసీపీ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు కొనసాగించారు. తాజాగా ఆ ప్రాంతం నుంచి గుట్టుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



ఇసుకను తరలించేందుకు వచ్చిన లారీ

రైతుల్లో ఆందోళన

ఇసుక అక్రమ తరలింపుతో ఈ ప్రాంత రైతుల్లో ఆందోళన నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల ఆ ప్రాంతంలో నీటిమట్టాలు బాగా తగ్గిపోయాయి. పంటలకు సాగునీరు అందని పరిస్థితి. తాజాగా మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇలా అయితే తమ వ్యవసాయ భూములకు సాగునీరు ఏ విధంగా అందుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కోనేరు రామభద్రపురం సమీపంలోని నాగావళిలో పోగేసిన ఇసుక ఇలా..



మా దృష్టికి వచ్చింది

కొమరాడ మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపించాం. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం.

- శ్రీనివాస్, జిల్లా గనుల శాఖాధికారి, పార్వతీపురం మన్యం

లారీని సీజ్ చేసిన అధికారులు

ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ శాఖ అధికారులు దృష్టి పెట్టారు. దీనిలో భాగంగానే మంగళవారం కొమరాడ మండలం కేఆర్‌బీ పురంలో ఇసుక అక్రమ తరలింపు ప్రాంతంలో ఉన్న లారీని మైనింగ్ అధికారులు సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

ఏనుగుల బీభత్సం

- పాలెంలో సంచారం
- పంటలు, బోరు పైపులైన్లు ధ్వంసం
- లబోదిబోమంటున్న రైతులు



పాలెం గ్రామంలోని పంట పొలాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం పాలెం పంచాయతీలో గజరాజులు బీభత్సం సృష్టించాయి. సోమవారం రాత్రి, మంగళవారం వేకువ జామున ఎనిమిది ఏనుగులు గ్రామ పరిసరాల్లో సంచరించి గ్రామస్థులను హడలెత్తించాయి. 60 పామాయిల్ మొక్కలు, వరి, మొక్కజొన్న పంటలు, కూరగాయల తోటలు, పొలాల్లో బోరు పైపులను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమన్నారు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తుంటే ఏనుగులు ధ్వంసం చేస్తూ తీవ్రంగా నష్టపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏనుగుల సంచారంతో అసలు పొలాలకు వెళ్లలేకపోతున్నామని వారు వాపోయారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించేలా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు. అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలన్నారు.

హాయ్ అనండి.. వాట్సాప్ సేవలు పొందండి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మన మిత్ర వాట్సాప్ నెంబర్ 95523 00009కు హాయ్ అని మెసేజ్ పెట్టి.. సేవలు పొందొచ్చని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వాయిస్ కమాండ్స్ ద్వారా కూడా కోరుకున్న సేవలను పొందొచ్చన్నారు. ఆధార్, మొబైల్ నెంబర్ లేదా సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ వంటి మరికొన్ని అదనపు వివరాలను టెక్ట్ లేదా వాయిస్ రూపంలో ఇచ్చి సర్వీస్ కన్ఫర్మేషన్ పొందాలన్నారు. లింకు ద్వారా చెల్లింపులు చేసి డిజిటల్ కాపీ లేదా రశీదును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బుధవారం విడుద లయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలను కూడా మన మిత్ర వాట్సాప్ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు తమ రోల్ నెంబర్ నమోదు చేసి ఫలితాల పీడీఎఫ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. జిల్లావాసులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే లింకులు, మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. ఎవరైనా డిజిటల్ అరెస్టు అని చెబితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బెట్టింగ్ యాప్స్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోరాదని, వాటిని ఇతరులకు షేర్ చేయరాదని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తియాప్ ఉపయోగించుకోవాలన్నారు.

నేడు టెన్త్ ఫలితాలు విడుదల

- హ్యాట్రిక్‌పై ఉత్కంఠ

సాలూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారం వెలువడనున్నాయి. అయితే జిల్లా మరోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించి హ్యాట్రిక్ విజయం అందుకుంటుందా? లేదా? అనే విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావర్గాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. పదో తరగతి ఫలితాల్లో వరుసగా గత రెండేళ్లు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జిల్లా ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉన్నతాధికారులు, విద్యాధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లారు. ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేకాధికారులను సైతం నియమించారు. 2023లో జిల్లాలో 10,689 మంది టెన్త్ పరీక్షలు రాయగా 9,350 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 10,443 మంది పరీక్షలు రాయగా 10,064 మంది పాసయ్యారు. ఈ ఏడాది జిల్లాలో పది వేల మంది పరీక్షలు రాశారు. ఈ నేపథ్యంలో జిల్లా రాష్ట్రంలో మళ్లీ ప్రథమస్థానం నిలుపుకుంటుందనే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వీడీవీకేల ద్వారా జీడి పిక్కల కొనుగోలు

- జాయింట్ కలెక్టర్ శోభిక



అధికారులతో మాట్లాడుతున్న జేసీ శోభిక

పార్వతీపురం/జియ్యమ్మవలస, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వన్ ధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకే) ద్వారా నాణ్యమైన జీడి పిక్కలు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ శోభిక సంబంధిత అధికారులను ఆదేశించారు. జీడి పరిశ్రమకు అవసరమైన ముడి సరుకుల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కొమరాడ మండలం చోళ్లపదంలో జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జేసీ సందర్శించారు. జీడిపిక్కలు, రికార్డులను పరిశీలించారు. ముందుగా వీడీవీకే సభ్యులు, జీడి రైతులతో మాట్లాడారు. అనంతరం సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. అయితే కొనుగోలు చేసిన జీడి పిక్కలను స్టోరేజ్ చేసే అవకాశం లేదనే విషయం ఏపీఎం సురేష్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తామని, పరిశ్రమకు తరలించే వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కిలో జీడి పిక్కలను రూ. 155 కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చోళ్లపదం, అంకుళ్లవలస గ్రామాల్లో వన్ ధన్ వికాస్ కేంద్రాలకు వెళ్లి జీడి పిక్కలను అమ్ముకోవచ్చని తెలిపారు.

దళారులను నమ్మి మోసపోకుండా..

పాచిపెంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోకుండా వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేస్తామని ఉద్యాన శాఖ అధికారి బి.శ్యామల తెలిపారు. మంగళవారం పిండ్రింగివలసలో జీడి పిక్కలను పరిశీలించారు. నందేడవలస, పద్మాపురంలలో వీడీవీకేల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని వెల్లడించారు. ఈ పరిశీలనలో వెలుగు సీసీలు , వీడీవీకే కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా వ్యవసాయం

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడే లక్ష్యం
- శాస్త్రవేత్తల సూచన
- ముగిసిన 'కోస్తా మండల' సమావేశం

6లో

పట్టాలపైకి పథకాలు

- అమలులోకి ఎన్నికల హామీలు
- ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు
- డీఎస్సీ ప్రకటనతో వందలాది ఉద్యోగాలు
- మత్స్యకార భరోసాతో వేలాది మందికి సాయం

సకాలంలో వైద్య సేవలు అందించండి

- వైద్య సిబ్బందికి ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచన

8లో

28న పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నిక

పాలకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక ఈనెల 28న జరపాలని ఎలక్షన్ కమిషన్ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే మూడుసార్లు ఎన్నిక ప్రక్రియ నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే కోరం లేకపోవడంతో ఈ ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 28న మరోసారి ఎన్నిక ప్రక్రియ చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. కాగా వైసీపీ, కూటమి సభ్యులు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

సాలూరులో శ్యామలాంబ పండగ ఏర్పాట్ల పరిశీలన

- కమిటీ సభ్యులతో చర్చించిన డీఎస్పీ రాంబాబు

6లో

రామనారాయణంలో దేవిశ్రీ ప్రసాద్

- రామాయణ ఘట్టాలను చూసి పులకించిన సంగీత దర్శకుడు

6లో

రేపటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- జూన్ 12న పునఃప్రారంభం

సాలూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ఈ నెల 24 నుంచి వేసవి సెలవులను ప్రకటిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.విజయ రామరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇప్పటికే పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులకు ముందే విద్యార్థుల నమోదు కార్యక్రమం సైతం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఉన్న 1789 ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.

37 మందికి మలేరియా లక్షణాలు

- గొందివలసలో గుర్తించిన వైద్యాధికారులు



గొందివలసలో రోగులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

సాలూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం కొత్తవలస పంచాయతీ పరిధి గొందివలసలో 37 మందికి మలేరియా లక్షణాలు ఉన్నట్టు వైద్యసిబ్బంది గుర్తించారు. ఈ గ్రామం నుంచి ఎక్కువమంది జ్వరాలతో మామిడిపల్లి పీహెచ్‌సీకి వస్తుండడంతో వైద్యధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఆ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. 86 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. వారి నుంచి రక్తనమూనాలు సేకరించి అక్కడక్కడే ఆర్‌డీటీ (ర్యాపిడ్ డయోగ్నోస్టిక్ టెస్ట్)చేశారు. కాగా 37 మందికి మలేరియా లక్షణాలున్నట్టు గుర్తించారు. వెంటనే గ్రామ సమీపంలో నిల్వ ఉన్న ఊటనీటిని బయటకు పంపే చర్యలు తీసుకున్నారు. జ్వరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. 86 మందికి మాస్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. వారందరికీ మందులు అందించారు. రాత్రివేళల్లో ఎవరికి బాగోలేకపోయినా 108 వాహనం ద్వారా తక్షణం మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించాలని హెల్త్ అసిస్టెంట్ సన్యాసిరావు, ఏఎన్ఎం పార్వతిలను ఆదేశించారు. గ్రామంలో 37 మందికి మలేరియా ఉన్నది లేనిదీ నిర్ధారణకు ఇంకా పూర్తిస్థాయిలో పరీక్షలు చేయాల్సి ఉందని, ప్రస్తుతం వారికి ఆర్డీటీలో పాజిటివ్‌గా గుర్తించామని పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ చెప్పారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

- ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి

భామిని, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి కోరారు. మంగళవారం బత్తిలిలో ఇంటింటికీ వెళ్లారు. ఒకటో తరగతిలో ప్రవేశంపై అవగాహన కల్పించారు. అనంతరం నేరడి, బిల్లుమడ పాఠశాలల్లో విద్యార్థి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో సౌకర్యాలు, ఇంగ్లిష్ మాధ్యమం, మధ్యాహ్న భోజనంపై వివరించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్‌లు, నోట్ బుక్‌లు, బూట్లు అందిస్తుందన్నారు. విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా గుణాత్మక బోధన అందిస్తున్నామని తెలిపారు.



బిల్లుమడ పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఇన్‌చార్జి డీఈవో

పట్టాలపైకి పథకాలు



- అమలులోకి ఎన్నికల హామీలు
- ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు
- డీఎస్సీ ప్రకటనతో వందలాది ఉద్యోగాలు
- మత్స్యకార భరోసాతో వేలాది మందికి సాయం

విజయనగరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో సంక్షేమ పథకాన్ని పట్టాలెక్కిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. ఇది ప్రజల్లో సానుకూలతను పెంచుతోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయ్యింది. దీంతో ప్రధాన సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. కానీ ప్రజల నుంచి మాత్రం మరికొంత కాలం వేచిచూద్దాం అన్న ధోరణి కనిపించింది. ప్రజలు ఊహించిందే ప్రస్తుతం నిజమవుతోంది. వారి ఆశలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

పింఛనుతో మొదలు...

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను మొత్తాన్ని పెంచారు. 2024 జూన్‌లో అధికారంలోకి వస్తే.. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.1000 వంతున.. జూలైలో పింఛను మొత్తం రూ.4000తో కలిపి రూ.7000 అందించారు. అటు దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించారు. ఈ రెండూ ప్రధాన పథకాలే. వీటిపై ప్రజల నుంచి సంతృప్తి కనిపించింది. అదే సమయంలో పల్లె పండుగ పేరుతో వందల కోట్ల రూపాయలతో గ్రామాల్లో రహదారులు, కాలువలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులపై గోతులు పూడ్చే పనిచేశారు. కొన్ని రహదారులకు శాశ్వత మరమ్మతులు చేపట్టారు. ఇంత చేసినా విపక్షాలు మాత్రం అనేక రకాలుగా విమర్శలు చేస్తూ వచ్చాయి. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించడంతో ప్రజల్లో మళ్లీ ప్రభుత్వంపై విశ్వాసం కలిగింది.

దశాబ్దాల కల నెరవేరేనిలా...

ఏప్రిల్ నెలలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో సానుకూలత ప్రారంభమైంది. ప్రధానంగా ఎస్సీ వర్గీకరణ అనే దశాబ్దాల కలను సాకారం చేసి చూపించింది కూటమి ప్రభుత్వం. జనాభా, వెనుబాటుతనం, సామాజిక సంబంధాల ఆధారంగా ఎస్సీలను మూడు విభాగాలుగా విభజించారు. రెల్లితో సహా 12 ఉపకులాలను మొదటి గ్రూపుగా, మాదిగతో పాటు 18 ఉప కులాలను రెండో గ్రూపుగా, మాలతో పాటు 29 ఉప కులాలను మూడో గ్రూపుగా వర్గీకరించారు. ఇది జిల్లాలోని ఎస్సీ ఉప కులాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే విషయం. దీనిపై ఆ వర్గాల నుంచి సానుకూలత వ్యక్తమవు తుండడం గమనార్హం.

● త్వరలో మరో రెండు..

మరోవైపు మే నెలలోనే రెండు కీలక పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా తల్లికి వందనం పథకం అమలుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరిట పథకాన్ని అమలు చేసింది. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున సాయం చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇంట్లో ఒకరికే పరిమితం చేశారు. అది కూడా తొలి ఏడాది రూ.14 వేలు, అటు తరువాత రూ.13 వేలు మాత్రమే అందించారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున సాయం చేయనున్నట్టు ప్రకటించింది. దీనికిగాను ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. మరోవైపు అన్నదాత సుఖీభవ పథకం కూడా అందించేందుకు సిద్ధపడుతోంది. గతంలో రైతుభరోసా పేరిట జగన్ సర్కారు దీనిని అందించింది. కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా అందించే రూ.6 వేలకు తోడు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 అందించేది. దీంతో ప్రతి రైతుకు రూ.13,500 మాత్రమే సాయం అందేది. తాము అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దానిని అమలు చేయడానికి సిద్ధపడుతున్నారు. కేంద్రం మూడు విడతలుగా అందించే రూ.2 వేలతో పాటు వీటిని అందించనున్నారు. 2 విడతలో రూ.5 వేలు, చివరి విడతలో రూ.4 వేలు అందించనున్నారు. ఇందుకుగాను వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

మెగా డీఎస్సీ ప్రకటన..

మరోవైపు మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో కూటమి ప్రభుత్వం పట్ల ఉన్న నమ్మకం రెట్టింపైంది. రాష్ట్ర వ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో జిల్లాకు 583 పోస్టులు కేటాయించారు. గత ఐదేళ్లుగా వేలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూశారు. కానీ జగన్ సర్కారు కాలయాపన చేసింది. 2019 ఎన్నికలకు ముందు ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తానని జగన్ చెప్పుకొచ్చారు. కానీ ఒక్కటంటే ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేకపోయారు. చివరిసారిగా 2018లో టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. నియామక ప్రక్రియ పూర్తి చేసింది. ఆ తరువాత 2024 ఎన్నికలకు ముందు కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చింది వైసీపీ ప్రభుత్వం. కానీ ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిలిచిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించింది.



26న మత్స్యకార భరోసా..

మరోవైపు మత్స్యకార భరోసా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఏటా వేట నిషేధం ఉంటుంది. సముద్రంలో చేపల ఉత్పత్తి జరిగే సమయం ఇది. ఈ సమయంలో మరబోట్లతో వేట సాగిస్తే చేపల ఉత్పత్తికి విఘాతం కలుగుతుంది. అందుకే ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకూ సముద్రంలో చేపల వేటను నిషేధిస్తారు. ఆ సమయంలో వేట నిషేధ భృతి అందిస్తారు. ఈ భృతిని ముందుగా అందించింది టీడీపీ ప్రభుత్వం. 2014లో టీడీపీ రూ.5 వేల చొప్పున పరిహారం అందించేది. రేషన్ సరుకులు కూడా ఇచ్చేది. జగన్ సర్కారు రేషన్ నిలిపివేసింది. మత్స్యకార భరోసా పేరిట రూ.10 వేలు అందించేది. తాము అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఈ నెల 26న శ్రీకాకుళం జిల్లాలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ తరువాత మత్స్యకారుల ఖాతాల్లో నగదు జమ కానుంది. జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 29 కిలో మీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. 16 గ్రామాల్లో 6 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మత్స్యకార జనాభా 27 వేలుకాగా.. 711 బోట్లు ఉన్నాయి. సంప్రదాయ వేట పడవలు 361 ఉన్నాయి. వీరందరికీ మత్స్యకార భరోసా కింద రూ.20 వేల చొప్పున అందనుంది.

వర్గీకరణతో మేలు..



ఎస్సీ వర్గీకరణ ఆహ్వానించదగ్గది. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు, రాయితీలు ఎస్సీల్లో కొన్ని వర్గాలకే పరిమితమైపోయాయి. వర్గీకరణతో సంక్షేమ, రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కుతాయి. ఈ విషయంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన వెంటనే ప్రభుత్వం స్పందించింది. కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ నివేదిక ఇచ్చిన వెంటనే నిర్ణయం తీసుకుంది. ఇది ఎస్సీలందరూ ఆహ్వానించదగ్గ విషయం

-పెంకి ఇజ్రాయల్, జిల్లా అధ్యక్షుడు, మాదిగల ఉద్యోగ సమాఖ్య, విజయనగరం

ఎంతో ఆనందం..



వేట నిషేధ భృతిని రెట్టింపు చేయడం చాలా ఆనందంగా ఉంది. గతంలో భృతిని అందించిన ఘనత ఈ ప్రభుత్వానిదే. అప్పట్లో కేవలం రేషన్, నిత్యావసరాలు అందించేవారు. కానీ 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ నిషేధ భృతిని అందుబాటులోకి తెచ్చింది. అయితే గత ఐదేళ్లలో భృతి అనర్హులకు అందించారు. ఈ ఏడాది టీడీపీ ప్రభుత్వం రెట్టింపు చేసింది. అర్హులందరికీ అందించాల్సిన అవసరం ఉంది.

-గరికిన చినరాము, మత్స్యకారుడు, ముక్కాం, భోగాపురం



రామనారాయణంలో దేవిశ్రీ ప్రసాద్

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలోని శ్రీమద్రామాయణ ప్రాంగణాన్ని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలసి మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని రామాయణ ఘట్టాలను చూసి పులకించిపోయారు. రామాయణంపై పరిశోధన కోసం ఏర్పాటు చేసిన వాల్మీకి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు చాణక్య శ్రీ హర్ష ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవిశ్రీ ప్రసాద్‌ను ఆశీర్వదించారు. ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణ ఆయనకు జ్ఞాపికను ఆయనకు అందజేశారు.



దేవిశ్రీ ప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న పీడీ మురళీమోహన్

పక్కా గృహాలకు 34 వేల దరఖాస్తులు

రామభద్రపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది ఇళ్ల నిర్మాణాలకు 34 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.మురళీ మోహన్ తెలిపారు. స్థానిక మండల హౌసింగ్ కార్యాలయంలో ఆయన మంగళ వారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు వీరంతా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మే 17వ తేదీ నుంచి వీరందరికీ ఇళ్లు మంజూరు కానున్నాయని తెలిపారు. ఇప్పటికే అర్బన్, రూరల్ కింద ఆన్‌లైన్‌లో జాబితాలు పొందుపరిచారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.2.50 లక్షల వంతున మంజూరు చేయనుందన్నారు. అలాగే గతంలో మంజూరై అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కా గృహాలకు కూడా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం హౌసింగ్ ఏఈగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మత్స వెంకటేష్.. ప్రాజెక్టు డైరెక్టర్ మురళీ మోహన్‌ను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ జీవీ రామారావు, డీఈ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు తప్పనిసరి

పాచిపెంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తి కోసం విత్తనాలు వేసినప్పుడు ఆయా కంపెనీల ద్వారా రైతులు ఒప్పంద పత్రాలు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ సూచించారు. మంగళవారం పాంచాళి, గురువునాయుడుపేట గ్రామాల్లో వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో కొంతవరకు, రబీ సీజన్‌లో ఎక్కువగా మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారని, దిగుబడి తగ్గిన తరువాత వ్యవసాయశాఖకు రైతులు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. అయితే ముందుగానే ఒప్పంద పత్రాలు తీసుకుంటే సమస్య ఉండదన్నారు. ఇకపై రైతులకు కంపెనీకి మధ్య వ్యవసాయశాఖ ఉంటుందని, నియమ నిబంధనలతో రూపొందించిన ఒప్పంద పత్రాలను అందజేస్తుందని వెల్లడించారు. ఇందులో కంపెనీ ఇచ్చిన మినిమం గ్యారంటీ, దిగుబడి కంటే తక్కువ వచ్చిన రైతుకు ఇవ్వాల్సిన నష్ట పరిహారం అంశాలను పొందుపరిచామన్నారు. ఒప్పంద కాపీని రైతు, కంపెనీకి, గ్రామ వ్యవసాయ సహాయకులకు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదనరావు, వైస్ ఎంపీపీ ధనుంజ యరావు, వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, వ్యవసాయ సహాయకులు గణేష్, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూలతో అలంకరణ





పూలతో అలంకరించిన ముత్యాలమ్మ తల్లి, తోగాలమ్మతల్లి విగ్రహాలు

గుడివాడ గ్రామ దేవతలు ముత్యాలమ్మ తల్లి, తోగాలమ్మతల్లికి మంగళవారం చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. గ్రామంలో వెలిసిన అమ్మవార్ల విగ్రహాలకు భక్తులు ప్రతి వారం అలంకరించి... విశేష పూజలు చేస్తారు. ఈ వారం అమ్మవార్లను పూలతో అలంకరించడంతో.. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

-భోగాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి)

స్పెషల్ ఒలింపిక్స్‌లో అజయ్‌కు బంగారు పతకం



బాడంగి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్-2025 క్రీడా పోటీల్లో స్థానిక ప్రభుత్వ పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మేథో వైకల్య దివ్యాంగుడు రాజాన అజయ్ ప్రతిభ కనబరిచాడు. సమగ్ర శిక్ష అభియాన్, రాష్ట్ర స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని అరిగిపల్లి గ్రామంలో ఇటీవల రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్-2025 క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 21న నిర్వహించిన మేథో వైకల్య హయ్యర్ ఎబిలిటీ 100 మీటర్ల పరుగులో అజయ్ ప్రతిభ చూపించాడు. బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్పెషల్ ఒలింపిక్స్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ మేరకు అజయ్‌ను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, డీఈవో యు.మాణిక్యంనాయుడు, సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, అసిస్టెంట్ ఐఈ భారతి, హెచ్ఎం, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మార్పులకు అనుగుణంగా వ్యవసాయం

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడే లక్ష్యం
- శాస్త్రవేత్తల సూచన
- ముగిసిన 'కోస్తా మండల' సమావేశం



హాజరైన శాస్త్రవేత్తలు, అధికారులు, తదితరులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యనారాయణ

విజయనగరం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాలంతో పాటు వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానం మారాలని సంబంధిత శాస్త్రవేత్తలు సూచించారు. విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనం వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్తర కోస్తా మండల పరిశోధన, విస్తరణ మండలి సమావేశం మంగళవారం రాత్రి ముగిసింది. ఈ సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు వివిధ సూచనలిచ్చారు. ఈ సమావేశానికి విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, నిపుణులు, అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఏటా ఉత్తర కోస్తాలో ఒక ప్రాంతంలో నిర్వహించే ఈ సమావేశానికి ఈ ఏడాది (2025-26) విజయనగరం వేదికైంది. జిల్లా వ్యవసాయ, దాని అనుబంధ శాఖలు, ఏరువాక కేంద్రం సమన్వయంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. గత ఏడాది అనుసరించిన విధానాలు, విత్తనాలు, వాటి పరిస్థితి, దిగుబడి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీకి అనుసరించాల్సిన విధానాలు, ప్రభుత్వం ఏం చేయాలి? కొత్త విత్తనాలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడం వంటి వాటిపై సమీక్షించారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మేలన్న విషయాన్ని అధిక శాతం శాస్త్రవేత్తలు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ తదితర విషయాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

వ్యవసాయోత్పత్తి మరింత పెరగాలి..

ఉత్తర కోస్తా మండల పరిశోధన, విస్తరణ మండలి సమావేశంలో భాగంగా మంగళవారం శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి వ్యవసాయోత్పత్తి మరింత పెరగాలని, ఆ దిశగా అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. ఉత్తర కోస్తా పరిధిలోని జిల్లాల్లో వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. శిక్షణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రైతులు పొలాల్లో మినీ కిట్లు, ప్రదర్శన కేంద్రాలను పెంచాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరతలక్ష్మి, నాబార్డు డీడీఎం నాగార్జున, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాంబ పండగ ఏర్పాట్ల పరిశీలన

సాలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండగ ఏర్పాట్లను డీఎస్పీ రాంబాబు మంగళవారం పరిశీలించారు. ముందుగా ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావుతోను, కమిటీ సభ్యులతోనూ ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండగ చేసుకోవాలన్నారు. పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఆయన వెంట పట్టణ సీఐ అప్పలనాయుడుతో పాటు పలువురు పోలీసు అధికారులు ఉన్నారు.



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు



సాగునీటి ఇబ్బందులు తప్పించండి

●రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే కోండ్రు వినతి



చీపురుపల్లి: మంత్రితో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



నెల్లిమర్ల: మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సువ్వాడ రవిశేఖర్



రాజాం: మంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం/ సంతకవిటి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. మంగళవారం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన ఆయనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తోటపల్లి కుడి కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ పిల్ల కాలువల నుంచి సాగునీరు అందడంలేదని వివరించారు. తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం ప్రాజెక్టులు పెండింగ్ పనులు సకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు రాజాం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేశ్ ఉన్నారు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి..

●నెల్లిమర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తారక రామతీర్థ సాగర్ రిజర్వాయర్ ముంపు బాధితులు, నిర్వాసితులకు పీఏఎఫ్ (ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్) ప్యాకేజీని అమలు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ కోరారు. మంగళవారం ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన ఆయన్ని సువ్వాడ కలిశారు. సారిపల్లి, కుదిపి నీలంరాజుపేట గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, బాధితులతో కలిసి నెల్లిమర్లలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముంపు బాధితుల సమస్యలను సువ్వాడ.. మంత్రి రామానాయుడుకు వివరించారు. అంతకు ముందు మంత్రి రామానాయుడును మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడుతో పాటు సువ్వాడ రవిశేఖర్, పార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మహంతి చిన్నంనాయుడు, పతివాడ అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఆయకట్టుదారులను ఆదుకోండి..

●చీపురుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కుడి ప్రధాన కాలువ పరిధిలోని ఆయకట్టుదారులను ఆదుకోవాలని, పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లాకు వచ్చిన మంత్రిని నాగార్జున కలిసి వినతిపత్రం అందజేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వేలాది మంది రైతులకు సాగునీటిని అందించే ఈ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పిల్ల కాలువలు, సీడీ పనులకు 53 కోట్లతో టెండర్లు పిలిచినా చీపురుపల్లి నియోజకవర్గంలో ఇంకా పనులు ప్రారంభం కాలేదని మంత్రికి వివరించారు.



గుర్ల: మంత్రికి ఉత్తరాంధ్ర సమస్యలను వివరిస్తున్న డాక్టర్ సుంకరి

ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయండి..

●గుర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ సీనియర్ నాయకుడు, ఉత్తరాంధ్ర విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తారక రామతీర్థసాగర్ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన మంత్రిని ఆయన కలిశారు. తారక రామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు, రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎక్సైజ్ బదిలీలు పారదర్శకమే

●సూపరింటెండెంట్ శ్రీనాథుడు

మెంటాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖలో ఇటీవల జరిగిన బదిలీలు పూర్తిగా పారదర్శకమని జిల్లా సూపరింటెండెంట్ శ్రీనాథుడు పేర్కొన్నారు. 'బదిలీలు సక్రమమేనా' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖలో జరిగిన బదిలీల్లో అక్రమాలు, అవకతవకలకు ఆస్కారమే లేదని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిబంధనలకు లోబడి వ్యవహరించామని పేర్కొన్నారు.

న్యాయాధికారి బదిలీ

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట న్యాయస్థానం న్యాయాధికారి సబ్బవరపు వాణికి బదిలీ అయింది. ఆమె స్థానంలో గజపతినగరం కోర్టు న్యాయాధికారి బి.కనకలక్ష్మి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడి న్యాయాధికారి వాణి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట కోర్టుకు బదిలీ అయ్యారు.

ఇకపై శుక్రవారం ప్రజాదర్బార్

విజయనగరం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ప్రతి బుధవారం నిర్వహించే ప్రజాదర్బార్ ఇకపై ప్రతి శుక్రవారం నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింద ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు ఈ మార్పును గమనించాలని కోరారు.

అనుమతులు లేని నిర్మాణాలను తొలగించండి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని కట్టడాలను గుర్తించి వాటిని తొలగించాలని నగరపాలక కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నగర సుందరీకరణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో ప్రణాళిక కార్యదర్శులు ప్రధాన భూమిక పోషించాలన్నారు.

భూములు రీసర్వే చేయండి

వేపాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామిపేటలో వివాదాలకు తావులేకుండా భూముల రీసర్వే నిర్వహించాలని ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రామస్వామిపేటలో డీటీ సన్యాసినాయుడు సారథ్యంలో చేపడుతున్న సర్వే పటిష్ఠంగా చేపట్టాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు ఆస్కారమివ్వరాదని కోరారు.

సెంచూరియన్‌లో టెన్త్ విద్యార్థులకు అంతర్ శిక్షణ

నెల్లిమర్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విజయనగరం కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న వృత్తి విద్యాకోర్సు విద్యార్థులకు 12 రోజుల పాటు సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అంతర్ శిక్షణ నిచ్చారు. ఈ శిక్షణలో భాగంగా మంగళవారం అంతర్ శిక్షణ పొందిన విద్యార్థులకు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాతకుమారి, డీన్ డాక్టర్ సన్నీ డయాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జోగినాయుడు, వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు తేజస్వినిపాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో మందు బాబులపై నిఘా

విజయనగరం క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో సోమవారం రాత్రి డ్రోన్ సాయంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులను పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. ఉడాకాలనీ, దుప్పాడ, అయ్యన్న పేట, గాజులరేగ, వైఎస్సార్ నగర్, నారాయణ పురం, బాబామెట్ట బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

భూ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వంగర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవలలో గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో రైతుల భూములను ప్రభుత్వ భూమిగా మార్చడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు రైతులు మంగళవారం కలెక్టర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదు చేశారు. మద్దివలసలో 250 ఎకరాల రైతుల భూములను ప్రభుత్వ భూములుగా మార్చారని వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారితో టీడీపీ నాయకులు వాసుదేవరావునాయుడు, మోహనరావు, దుర్గాబాబు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



రిక్షా కాలనీలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

గరివిడి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ మండలంలో కోడూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.కనకేశ్వరరావు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం రాత్రి కోడూరులో పిల్లల తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకుడు వెంకునాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కూడా పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సోంపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం

●వేపాడ: మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీవీఏ రాజు సారథ్యంలో ఉపాధ్యాయులు జాకేరు, సోంపురం, అరిగిపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. అలాగే దబ్బిరాజుపేట ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం దబ్బిరాజుపేటల్లో పర్యటించారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

మెరకముడిదాం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం సందడిగా జరిగింది. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆల్తి రాంబాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో టీం వర్క్, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని అన్నారుఈ సందర్భంగా విద్యార్థుల స్కిట్‌లు, ఆటపాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బోడసింగి ఉమ, ఉపాధ్యాయులు జి.అప్పలనాయుడు, కె.త్రివేణి, బి.శ్రీదేవి, ఆర్.నారాయణరావు, వి.మోహనరావు, అంగన్‌వాడీ ఎస్.హేమలత, ఆయా కె.అశ్విని పాల్గొన్నారు.

డీఎస్సీకి అనుమతించండి

నెల్లిమర్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 పరీక్షకు తమను అనుమతించాలని 2023-25 బ్యాచ్ డైట్ విద్యార్థులు కోరారు. స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ వద్ద విద్యార్థులు వి.ప్రతిక్ష, టి.శ్రావణి, ఎం.అనిత, వి.మహేష్ తదితరులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డైట్ కోర్సు మార్చితో పూర్తయిందని, నాలుగో సెమిష్టర్ త్వర లో పూర్తవుతుందన్నారు. న్యాయమైన డిమాండ్‌ను విద్యాశాఖ మంత్రి లోకేశ్ పరిశీలించాలని కోరారు.

బహిష్కరణ నిందితులపై చర్యలు చేపట్టండి

నెల్లిమర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో దళితులను సామాజిక బహిష్కరణకు గురిచేసిన అగ్రవర్ణాల వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని జైభీమ్ భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో దళితుడు మరణించినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

నవగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాం లో గల పురాతన ఉమాచోడేశ్వర ఆలయంలో మంగళవారం నవగ్రహ పీఠం ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు కార్యక్రమంలో తొలిరోజు హోమాలను అర్చకులు నిర్వహించారు. తాండ్రంగి సర్పంచ్ కరక వందన, దశరథ్ దంపతులు పాల్గొన్నారు.

అది సర్కారు చెరువే..



చెరువును పరిశీలిస్తున్న తహసీల్దారు

చీపురుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జి.అగ్రహారంలోని సర్వే నెంబరు 232/3లో గల సోమరాజు కోనేరు ప్రభుత్వానిదేనని తహసీల్దారు ఎస్.రాజారావు స్పష్టం చేశారు. చెరువు పనులకు ఇటీవల రూ.8 లక్షలు మంజూరయ్యాయి. అక్కడ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొంత మంది అడ్డుకున్నారు. దాంతో జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు రాజారావు మంగళవారం చెరువును పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెం.232/3లో సోమరాజు కోనేరు 49 సెంట్లలో విస్తరించి ఉందని తేల్చారు. 22ఏలో నమోదై ఉందన్నారు. చెరువులో ఉపాధి పనులు చేపట్టవచ్చునని స్పష్టం చేశారు. తహసీల్దారు వెంట ఆర్‌ఐ రామ్‌కుమార్ ఉన్నారు.

28 నుంచి ఫీల్డ్ అసిసెంట్ల సమ్మె



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

చీపురుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిసెంట్లు ప్రకటించారు. మంగళవారం ఎంపీడీవో ఇప్పలవలస సురేష్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అంతకు ముందు వారు మండల పరిషత్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లపై నినాదాలు చేశారు. ఫీల్డ్ అసిసెంట్ల సంఘ ప్రతినిధి అప్పలనాయుడు మాట్లాడుతూ 19 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమను పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం



ఎన్నికైన మండల అధ్యక్షులు

రాజాం/ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకాలు పట్టణంలో మంగళవారం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ పాల్గొన్నారు. పార్టీ రాజాం మండల అధ్యక్షుడిగా మజ్జి నరసింహానాయుడు, వంగర మండల అధ్యక్షుడిగా బెవర సత్యంనాయుడు, రేగిడి మండల అధ్యక్షుడిగా కుప్పిలి శిమ్మయ్య, సంతకవిటి మండల అధ్యక్షుడిగా కనకల రాజశేఖర్‌లను నియమించారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియార్ నాయకుడు సానమనేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం



మొక్కలు నాటుతున్న యోగ సాధకులు

రాజాం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ధరిత్రీ దినోత్సవం సందర్భంగా స్థానిక కోదండ రామాలయ ప్రాంగణంలో వికాసతరంగణి యోగ సాధకులు, రామాలయం కమిటీ సభ్యులు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వికాస తరంగణి సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీపీ రమణమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికాస తరంగణి రాజాం శాఖ అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, పెంకి చైతన్యకుమార్, పెంకి గౌరీశ్వరరావు, ఆర్‌వీజే నాయుడు, ఎం.బాబ్జీ, అర్నిపల్లి వెంకటనాయుడు, పందూరి వేణుగోపాలరావు, లెంక శ్రీహరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సహకరిస్తే కర్మాగారాన్ని మళ్లీ తెరుస్తాం



కర్మాగారం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

కొత్తవలస, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు సహకరిస్తే మళ్లీ కర్మాగారాన్ని తెరుస్తామని జేఎస్ఎల్ కర్మాగారం యాజమాన్య ప్రతినిధి దినేష్ శర్మ తెలిపారు. మంగళవారం సాయంత్రం విజయనగరంలోని డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంఘాలు, యాజమాన్యానికి మధ్య చర్చలు జరిగాయి. యాజమాన్యం తరపున దినేష్ శర్మ, గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్మాగారం ఎదుర్కొంటున్న సమస్యలను కార్మికశాఖ అధికారులు ముందుంచారు. తాము తాత్కాలికంగా కర్మాగారాన్ని నిలుపుదల చేయాల్సి వచ్చిందని తెలిపారు. కార్మికులు సహకారం అందిస్తే మళ్లీ కర్మాగారాన్ని తెరుస్తామన్నారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కర్మాగారాన్ని మూసేస్తే కార్మికుల కుటుంబాలు ఎలా బతుకుతాయనిన ప్రశ్నించారు. ఈ నెల 28న ఉదయం కర్మాగారంలో కార్మిక సంఘాలు, యాజమాన్యం చర్చలు జరుపుకోవాలని డీసీఎల్ తెలిపారు. మే 2న సాయంత్రం 4గంటలకు ఇరువర్గాలు చర్చలకు హాజరుకావాలని కార్మికశాఖ అధికారి సూచించారు. చర్చల్లో తమ్మినేని సూర్యనారాయ (సీఐటీయూ) పి.అప్పలరాజు(టీఎన్‌టీయూసీ) నమ్మి చినబాబు, సలాది భీమయ్య, పి.బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు. చర్చలకు ముందు కర్మాగారం ఎదుట కార్మికులు కొద్దిసేపు ఆందోళన చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

●మరో ఇద్దరికి గాయాలు

గంట్యాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండతామరాపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు, మరో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ పరిధిలోని భీమిలి మండలం చినగదిలికి చెందిన యువకులు జి.దినీష్, కార్తీక్, సింహాద్రి మంగళవారం వేకువజామున ఉదయం 4.30 సమయంలో అనంతగిరి వ్యూపాయింట్ వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి భీమిలికి వస్తుండగా కొండతామరపల్లి వద్ద కల్వర్టును బలంగా ఢీ కొన్నారు. దాంతో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న దినీష్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన కార్తీక్, సింహాద్రిలను స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సాయికృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని శ్రీనివాస కాలనీకు చెందిన కిలపర్తి కృష్ణ(72) మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. కృష్ణ భార్య ఐదేళ్లక్రితం మరణించిందని అప్పటి నుంచి మానసిక బాధతో కుమిలిపోతున్నాడన్నారు. దీంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

1.126 కేజీల గంజాయి పట్టివేత

● ఇద్దరు యువకుల అరెస్ట్

సంతకవిటి/రాజాం ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు రాజాం సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. మండలంలోని గడ్డిముడిదాం వద్ద తోటపల్లి కాలువ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అదే చెందిన కలివరపు సురేష్‌కుమార్, వీరఘట్టం మండలం కత్తులకవిటికి చెందిన కొత్తవరపు లోకేశ్ ప్రయాణిస్తున్న బైక్‌లో 1.126 కేజీల గంజాయి ప్యాకెట్ లభ్యమైందన్నారు. తహసీల్దారు, వీఆర్‌వో సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

రామభద్రపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారైన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. ఈనెల 14న కొట్టక్కి వద్ద గంజాయి రవాణా చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా అల్లూరి మండలానికి చెందిన కొర్ర యోగీశ్వరరావును అరెస్టు చేశామన్నారు. స్థానిక బైపాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు విచారించారన్నారు. దాంతో నేరాన్ని అంగీకరించాడన్నారు. సీఐతో ఎస్ఐ వెలమల ప్రసాదరావు, ఏఎస్ఐ అప్పారావు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని పందిరిప్పన్న జంక్షన్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక నడబందకు చెందిన యలమంచిలి కృష్ణ రైస్‌మిల్లులో పనిచేస్తున్నాడు. ప్రతిరోజులాగే మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీ కొట్టాడు. దాంతో కృష్ణ తలకు గాయమైంది. కాళ్లు, చేతులు విరిగాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

లక్కవరపుకోట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు రూరల్ ఫీడర్‌కు చెందిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం రాత్రి చోరీకి గురైందని ఎల్.కోట విద్యుత్ శాఖ అధికారి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలిపారు. ఇప్పటికే తలారి, ఎల్.కోట, జమ్మాదేవిపేట బంగ్లా, మల్లివీడు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయన్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు.

బాత్‌రూంకు వెళ్లొస్తానని.. బైక్‌తో వ్యక్తి పరారీ

కొత్తవలస, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూంకు వెళ్లొస్తానని చెప్పి బైక్ తీసుకెళ్లిన వ్యక్తి దాంతో పరారీ అయిన ఘటన సోమవారం కొత్తవలసలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస-కె.కోటపాడు రోడ్డులోని జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లో శ్రీనివాసరావు ఫుడ్‌కోర్టును నిర్వహిస్తున్నాడు. అతడి వద్ద జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌కు చెందిన జిలానీ పనికి కుదిరాడు. మంగళవారం ఫుడ్ కోర్టులో పనిచేస్తున్న జిలానీ పక్క షాపునకు చెందిన వ్యాపారిని బాత్‌రూంకు వెళ్లి వస్తానని బైక్‌ను అడిగాడు. పక్క దుకాణంలోనే జిలానీ పనిచేస్తుండటంతో బైక్‌ను అతడు ఇచ్చాడు. అదే అదనుగా భావించిన జిలానీ.. శ్రీనివాసరావుకు చెందిన ఫుడ్ కోర్టు క్యాష్ కౌంటర్‌లోని రూ.7 వేలు, బైక్‌తో అక్కడి నుంచి పరారీ అయ్యాడు. బాత్‌రూంకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ షన్ముఖరావు షాపింగ్ కాంప్లెక్స్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. జిలానీ ఆధార్ కార్డు కోసం అడిగారు. లేదని చెప్పడంతో అలాంటి వ్యక్తులను ఎలా పనిలో పెట్టుకుంటారని మందలించారు. పరారైన వ్యక్తి సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా జిలానీని పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం సీహెచ్‌వోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌వోలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. క్లినిక్‌ల అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు తేజస్విని, మౌనిక, తరుణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసం ఉన్నచోట పట్టాలు మంజూరు చేయాలన్నారు. కరెంట్ బిల్లుతో సంబంధం లేకుండా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమణ, బుగత అశోక్, ఆనందరావు, రంగరాజు ఉన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

జామి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లిలో మంగళవారం అంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల్లో జడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, రవికుమార్ దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

సీఎం సహాయ నిధి అందజేత


బాధితుడికి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం పరశురాం పురం గ్రామానికి చెందిన వావిలపల్లి రామారావుకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. రామారావు అనారోగ్యానికి గురి కావడంతో ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1లక్షా 50వేలు సాయం అందేలా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటాపు భారతమ్మ, సంతోషి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదవారికి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరిని వారు మంగళవారం కలిసి, వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు జీవన్న, సూరయ్య మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం రెండు మండలాల్లో ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

సకాలంలో వైద్య సేవలు అందించండి

- ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి


వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బడ్డుమానంగి ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా వేసవి సెలవుల్లో చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు. విద్యార్థుల వసతిగృహాలకు సంబంధించిన మరమ్మతులను వేసవి సెలవుల్లో చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, హెచ్‌ఎం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు

కురుపాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలలో మలేరియా నివారణకు గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఎంఎల్‌హెచ్‌పీలు కృషి చేయాలని జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాదరావు కోరారు. మంగళవారం కురుపాంలో జిల్లా మలేరియా అధికారి వై. మణి ఆధ్వర్యంలో మలేరియా ప్రభావిత ప్రాంతాలలో నిర్వహించనున్న ఏసీఎం 5 శాతం స్ప్రేయింగ్‌పై కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు ముఖ్యమైన ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌ను గ్రామాల్లో సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా కన్సల్టెంట్ జి.రామచంద్ర గ్రామాలలో ఎలా స్ప్రేయింగ్ నిర్వహించాలన్నా విషయంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, మలేరియా సూపర్‌వైజర్ కె.రాధాకృష్ణ, ఎంటీఎస్ రాజశేఖర్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోండి


విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు సూచించారు. మంగళవారం స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌పై ఆయన బూట్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థినులు తయారు చేసిన పలు రకాల ప్రాజెక్టులను పరిశీలించి, అభినందించారు. ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రం పరిశీలన

సీతానగరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని డీపీవో కొండలరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను గ్రామంలోని ప్రజలు ఇంటి వద్దనే వేరు చేసి ఇచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీ ఆర్‌డీ కేకేకే వర్మ, పంచాయతీ కార్యదర్శి శశిభూషణ్‌లు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి


చినగుడబలో వానపాములను విడుదల చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని చినగుడబ, వల్లరిగుడబ పంచాయతీల పరిధిలోని చెత్త సంపద కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద కేంద్రాల్లో తయారు చేసిన ఎరువులను రైతులకు విక్రయించి, అభివృద్ధి పనులు నిర్వహించాలన్నారు. అనంతరం ఎరువులకు అవసరమైన వానపాములను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

- శిథిలావస్థలో మురుగునీటి కాలువలు
- పూడికలు తొలగించని వైనం


చలివేంద్రిలో మురుగుతో నిండిన కాలువ

వీరఘట్టం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఈ మురుగునీటి కాలువను చూస్తే అధికారుల నిర్లక్ష్యం మనకు కళ్లకు కట్టినట్టు తెలుస్తోంది. రోజుల తరబడి కాలువల్లో మురుగు నిండిపోయి ఉన్నప్పటికీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదీ చలివేంద్రి గ్రామంలోని మురుగునీటి వ్యవస్థ దుస్థితి. ఇప్పటికే ఈ కాలువలు చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికితోటు రోజుల తరబడి మురుగు పేరుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇలా అయితే రోగాలు రావా.. అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో మురుగును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ● ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శేఖర్ వద్ద ప్రస్తావించగా వీధుల్లో కొత్తగా చేరానని, పరిశీలించి పారిశుధ్య పనులు నిర్వహిస్తామని చెప్పారు.

సమస్యల రహిత పార్వతీపురమే లక్ష్యం

- ఎమ్మెల్యే విజయచంద్ర
- వార్డుల్లో పర్యటన


పార్వతీపురంటౌన్: ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల రహిత పార్వతీపురమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గుడ్ మార్నింగ్ పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పట్టణంలోని 9వ, 10వ వార్డుల్లో గల పలు వీధుల్లో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పార్వతీపురం మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా సమస్యలు ఉన్నాయన్నారు. అందుకే గుడ్‌మార్నింగ్ పార్వతీపురంలో భాగంగా ఆయా వార్డుల్లో పర్యటిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛసుందర పార్వతీపురాన్ని నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యుల సహకారం తీసుకుంటున్నామన్నారు. మున్సిపాల్టీలో 7 మురికివాడల్లో గల సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు అధికారులను ఆదేశించామని చెప్పారు. సాధారణ, బుడా, 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసి పార్వతీపురాన్ని ఆధునీకీకరిస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేందుకు 30 వార్డుల ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసరాజుతో పాటు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జయప్రకాష్ నారాయణ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వెంకమ్మపేటలో ప్రజా దర్బార్

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని వెంకమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో అనేక గ్రామాలకు పక్కా రహదారి పనులు జరిగే విధంగా నిధులు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటికే అనేక రహదారులు పూర్తయ్యాయన్నారు. పార్వతీపురం పట్టణ ప్రజలకు జంఝావతి ద్వారా తాగునీరు వచ్చే విధంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు.

పనులు కల్పించాలి

- ఉపాధి వేతనదారుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉపాధి వేతనదారులు

బలిజిపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెదపెంకి గ్రామస్థులు ఆందోళన చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు నిర్వహిస్తున్నప్పటికీ పెదపెంకి గ్రామంలో కొంతమందికే పనులు కల్పించారని, దీనివల్ల అర్హులైన వారు పని లేక ఇబ్బంది పడుతున్నారు. అర్హులందరికీ పనులు కల్పించాలని, చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని, పనిచేసిన చోట మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని, రోజుకు ఒక పూట పని కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో నగేష్‌కు, ఉపాధిహామీ ఏపీవో రావుకు వినతిపత్రం అందజేశారు.

బకాయిలు చెల్లించాలి


చినభోగిలి సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

సీతానగరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని చినభోగిలి పంచాయతీ సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సీహెచ్‌సీ కృష్ణ అధ్యక్షతన మంగళవారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడారు. జనవరి నుంచి వేతనదారులు పనులు చేస్తున్నారని, చేసిన పనికి 14 రోజుల్లో కూలి చెల్లించాలని చట్టంలో నిబంధన ఉన్నప్పటికీ నేటికీ నెలల తరబడి బకాయిలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. వేతనదారులు పాల్గొన్నారు.

● పార్వతీపురం: ఉపాధి కూలీలు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా వేతనదారులకు కొన్ని నెలలుగా వేతనాలు అందలేదు. దీనిపై డ్వామా పీడీ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా త్వరలోనే చెల్లింపులు జరుగుతాయన్నారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల ప్రదానం

మక్కువ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో శిక్షణ పొందిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్టు ఎంఈవో-2 శ్యాంసుందరరావు తెలిపారు. ములక్ష్యాయవలస ఆదర్శ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల అనంతరం సెలవుల్లో ప్రత్యేక ఇంటర్న్‌షిప్ నిర్వహించినట్టు చెప్పారు. వీరికి మంగళవారం సర్టిఫికెట్లను అందించారు. ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత, విద్యా కమిటీ చైర్మన్ శిష్టు భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి, ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అర్హత ధ్రువపత్రాలను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ మంగళవారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 12 రోజుల పాటు నిర్వహించిన వృత్తి విద్యా కోర్సులు ఇంటర్న్‌షిప్ దాదాపు 69 మంది పూర్తి చేశారు. ఇందులో భాగంగా సచివాలయం, మీసేవ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాపింగ్‌మాల్స్ సందర్శించి అవి పనిచేసే విధి విధానాలను తెలుసుకున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు సర్టిఫికెట్స్‌ను అందించామన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ వానపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ మండల ధనలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు, ఒకేషనల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో పోరాడుదాం



గుమ్మలక్ష్మీపురం: లెనిన్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తొలి సోషలిస్టు విప్లవ యోధుడు లెనిన్ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుండంగి లింగరాజు అధ్యక్షతన తొలి సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేసిన లెనిన్ జయంతి సభను మంగళ వారం నిర్వహిం చారు. ఈసందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. తోట జీవన్న మా ట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారత అడవుల్లో ఆదివాసీలపై సాగుతున్న దాడులను ఖండిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, పార్టీ జిల్లా సమితి సభ్యులు మండంగి సింగన్న, గిరిజన యువత పాల్గొన్నారు.

● పాలకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మార్క్సిస్ట్ మహా ఉపాధ్యాయుడు, కామ్రేడ్ లెనిన్ జయంతిని మండలంలోని బర్నసీతంపేటలో మంగళవారం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) నాయకుడు పేడాడ భాస్కరరావు జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ నాయకులు బిడ్డి నాగేశ్వరరావు, నిమ్మక ఆదినారాయణ బిడ్డిక సత్యం, సవర సురేష్, కూరంగి ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన ఎయిడెడ్ పాఠశాలను ప్రారంభిస్తాం

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమ్మంగి, పి.ఆమిటి, బొద్దిడి గ్రామాల్లో మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి ఈ విద్యా సంవత్సరం జూన్ నెలలో ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దీనమయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో ఎంఈవో మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే పాఠశాలలు మూతపడిన విషయాన్ని విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొని వెళ్లడంతో పునః ప్రారంభానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. బాలేసు, కేదారిపురం పంచాయతీల్లో రూ.2.5 కోట్లతో వసతిగృహాలు మంజూరైనట్టు చెప్పారు. 76 పాఠశాలలకు ప్రహరీలు మంజూరైనట్టు తెలిపారు. మండలంలో 23 మోడల్ ప్రాథమిక పాఠశాలలు మంజూరైనట్టు తెలిపారు. పాఠశాల యూనిఫాం కొనుగోలు చేయాలని ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.650 చొప్పున పి.ఆమిటి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు వసూలు చేస్తున్నారని ఎంపీటీసీ బృందావతి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై పరిశీలిస్తామని ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్ తెలిపారు. దుడ్డుఖల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రేడింగ్ విధానంలో పీహెచ్‌సీ పదో స్థానంలో ఉందన్నారు. గ్రామాల్లో మలేరియా సోకకుండా స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన సచివాలయ భవనాల సిమెంట్ బిల్లులు నేటికీ మంజూరు కాకపోడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత పంచాయతీరాజ్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ, జీసీసీ, గృహ నిర్మాణం తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజు, తహసీల్దార్ శేఖర్, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పాలకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ఓ క్రిస్టియన్ సంస్థకు చెందిన శ్మశాన వాటికకు సంబంధించిన ఎకరా ఐదు సెంట్లు స్థలం ఆక్రమణలకు గురైనట్టు పాలకొండ పట్టణానికి చెందిన సబ్బ నానాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలానికి రెవెన్యూ శాఖ గతంలో పొజిషన్ సర్టిఫికెట్లు కూడా అందించిందని నానాజీ చెప్పారు. ఆక్రమణలకు పాల్పడి, కట్టడాలు చేపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో ఉన్న పప్పు దినుసులు మిల్లును వెంటనే మూయించాలని ఆయన రెవెన్యూ అధికారులకు విన్నవించారు.

పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బాడంగి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఈనెల 24న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ జీయో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. మిస్సింగ్ సిటిజన్ డేటా కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ప్రతి పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ రాక

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాకు రానున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని నర్సిపురం గ్రామంలో అంగన్‌వాడీ కంటైనర్ కేంద్రం ఏర్పాటును పరిశీలిస్తారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ పాల్గొంటారన్నారని సీడీపీవో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

లుంబూరులో జనసేన బహిరంగ సభ

పాలకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లుంబూరు గ్రామంలో బుధవారం సాయంత్రం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు, ఏపీ తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాబ్‌మేళా వాయిదా

పార్వతీపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో బుధవారం జరగనున్న జాబ్‌మేళా అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న సాలూరులో శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా జరగనుందని ఇది వరకు ప్రకటించామని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, తదుపరి తేదీ త్వరలో ప్రకటించనున్నట్టు ఆ ప్రకటనలో వివరించారు.

ఆదివాసీ రైతులకు సామగ్రి పంపిణీ

భామిని, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులకు ఐటీడీఏ ఉద్యానశాఖ ద్వారా వేపపిండి, వేపనూనె, బ్యాటరీ స్ప్రేయర్లను మంగళవారం పంపిణీ చేశారు. మంగళవారం బొడ్డగూడ గ్రామంలో 39 మంది రైతులకు వీటిని అందించారు. స్ప్రేయర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సంజీవరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ సమస్యలను పరిష్కరించండి

పాలకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ నూతన కమిషనర్ ఎస్వీజే రత్నంరాజును స్థానిక గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు మంగళవారం కలిశారు. గ్రంథాలయ సమస్యలను ఆయనకు వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. గ్రంథాలయ పన్ను చెల్లింపు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మక్కువ-చినభోగిలి రహదారికి మోక్షం


కొంతమేర పూర్తయిన రహదారి

మక్కువ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మక్కువ-చినభోగిలి రహదారికి మోక్షం కలిగింది. ఈ రహదారి గోతులమయంగా ఉండడంతో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రహదారికి మోక్షం కలిగింది. సుమారు రూ.38 కోట్లతో 16 కిలోమీటర్ల మేర రహదారి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆరు కిలోమీటర్ల తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి.